క్లుప్తంగా

మూఢనమ్మకాలతో జీవితాలు చిన్నాభిన్నం



చిన్నంబావి: కలెక్టర్ తేజస్‌నందులాల్ పవార్ ఆదేశాల మేరకు సోమవారం సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి బృందంచే మండలంలోని పెద్దదగడలో ఉపాధి కూలీలకు ఆరోగ్య జాగ్రత్తలు, మూఢనమ్మకాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కళాకారులు తమ ఆటపాటల ద్వార ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేంద్ర, సాంస్కృతిక సారథి బృందం అధ్యక్షురాలు ఎస్ సువర్ణ, కళాకారులు శ్రీనివాసులు, గుడిసె శివలింగం, డప్పు నరసింహా, కృష్ణయ్య, బోనాసి రాజు, మల్లెపు రాధ, శ్రీదేవి, ఫ్రాన్సిల్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి


వెంకట్‌రెడ్డి (ఫైల్)

కొత్తకోట రూరల్: పెద్ద మందడి మండలంలోని చిన్నమందడి గ్రామ మాజీ సర్పంచ్ విట్ట వెంకట్‌రెడ్డి(91) మృతి చెందాడు. వెంకట్‌రెడ్డి కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 1964 నుంచి 1969 వరకు అడ్డాకుల మండల సమితి ప్రెసిడెంట్‌గా పనిచేయడంతో పాటు నాలుగు దఫాలుగా సర్పంచ్‌గా కొనసాగారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులతో పాటు చిన్నమందడి, వీరాయిపల్లి, గట్లఖానాపూర్, మంగంపల్లి, అల్వాల గ్రామాల ప్రజలు వచ్చి వెంకట్‌రెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి అంత్యక్రియలో పాల్గొన్నారు. వెంకట్‌రెడ్డికి భార్య భగీరథమ్మతో పాటు కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి, కూతురు వసంత ఉన్నారు.

మరమ్మతు పనులు పూర్తి చేయాలి



పాన్‌గల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో చేపట్టిన మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. సోమవారం ఆయన పీఆర్ ఏఈ సత్తయ్యతో కలిసి మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.17 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులను నిబంధనల మేరకు నాణ్యతగా చేపట్టాలన్నారు. ఆయా నిధులతో అవసరమైన మౌలిక వసతులను అన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. నిబంధనల మేరకు పనులు చేపట్టకపోయిన, నాణ్యత లోపించిన సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

అమరచింత: పట్టణంలో విద్యుత్ అంతరాయం కలుగుతుండటంతో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ ఆదేశాలతో సోమవారం వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేసి వార్డుల వారిగా ప్రజలకు నీటిని అందించామని కమిషనర్ మహమ్మద్ ఖాజా తెలిపారు. రెండు రోజులుగా ఈదురు గాలులతో కురిసిన వర్షాలకు విద్యుత్ తీగలు తెగిపడటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. దీంతో మిషన్ భగీరథ పంప్‌హౌజ్ నుంచి కుళాయిలకు నీటి సరఫరా జరగలేదని తెలిపారు. మున్సిపాలిటీ సిబ్బంది ద్వారా నీటి ఇబ్బందులు కలిగిన వార్డులను గుర్తించి నీటిని అందిస్తున్నామన్నారు.

'పేద బ్రాహ్మణులను ఆదుకోవాలి'



పాన్‌గల్: జిల్లాలోని పలు దేవాలయాల్లో పనిచేస్తున్న పేద బ్రహ్మణులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి శివాలయాన్ని ఐక్యవేదిక నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయాల్లో పని చేస్తున్న పూజారులకు ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేలలో రూ.2 వేలు నిర్వహణ ఖర్చులు పోగా మిగిలిన రూ.4 వేలు సరిపోక కుటుంబ పోషణ భారంగా మారుతుందని తెలిపారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి ప్రతి పూజారికి నెలకు రూ.20 వేల వేతనం ఇవ్వాలని కోరారు. గ్రామంలో అఖిలపక్ష గ్రామ కమిటీ అధ్యక్షుడిగా అశోక్‌గౌడ్‌ను నియమించారు. ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సభ్యులు రాములు, గోపాలకృష్ణ నాయుడు, సీఐటీయూ నాయకులు రాము, వెంకటనారాయణ, అశోక్ పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మిక లోకం

అమరచింత: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను పురస్కరించుకొని మండలంలోని పాంరెడ్డిపల్లిలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోషా మేడే జెండాను ఆవిష్కరించారు. అమరచింతలో సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీల అనుబంధ సంఘాలు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ సంఘాలు ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో అబ్రహం, రాజు, సామెలు, రాజన్న, రమేష్, జీఎస్.గోపి, అజయ్, వెంకటేష్, శ్యాంసుందర్, భాస్కర్, ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండా, పాన్‌గల్, రేమద్దుల గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో, బుసిరెడ్డిపల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఎర్రజెండాలతో కార్మికులు, కర్షకులు ర్యాలీ నిర్వహించారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఎం వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్, హమాలీ సంఘం నాయకులు మే డే సందర్భంగా కార్మిక జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో బాల్‌రెడ్డి, సీహెచ్ వెంకటయ్య, ఆశన్న, మురళీ, రాములు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంతో పాటు వెంకటాపురం, తాటిపాముల, శ్రీరంగాపురం, నాగసానిపల్లి, శేరుపల్లి, కంభాళాపురం గ్రామాల్లో సీఐటీయూ, హమాలి సంఘం, పారిశుద్ధ్య కార్మికుల ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలు నిర్వహించారు.


తెల్లరాళ్లపల్లితండాలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


ఆత్మకూర్‌లో..

మదనాపురం: మండల కేంద్రంతో పాటు అజ్జకొల్లు రామన్‌పాడు కొన్నూరు, నర్సింగాపురం, దంతనూరు, దుప్పల్లిలో సీపీఎం, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాజు, సర్పంచ్ రాంనారాయణ, శ్రావణి, జగదీష్, వెంకట్రాములు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావి: మండల కేంద్రంలో సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు, హమాలీ సంఘం నాయకులు, వీఓఏలు మే డే సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో సీఐటీయూ అధ్యక్షుడు దర్గా స్వామి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, వెంకటేష్, రాజేంద్రగౌడ్, శ్రీను, శ్రీనివాసులు, వెంకటస్వామి, శ్రీరాములు, కుర్మయ్య, సుగుణమ్మ, మద్దమ్మ, బాలమ్మ, లలితమ్మ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో సోమవారం మేడే వేడుకలను ఆయా ప్రజాసంఘాల నాయకులు, కార్మికులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చెన్నారం, గోపాల్‌పేట గ్రామాల్లో రైతుసంఘం నాయకులు, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు.

ఆత్మకూర్: ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ, సీఐటీయూ, జన్‌కో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీహరి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు విజయరాములు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, జిల్లాకార్యదర్శి ప్రసాద్, పీఓడబ్ల్యూ రాష్ట్రకార్యదర్శి విజయ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండు వద్ద హమాలీ, తాపీ మేస్త్రీ కార్మిక సంఘాల కార్మికులు సీఐటీయూ జెండాను ఎగరవేశారు. సోళీపురంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాలీశ్వర్‌రెడ్డి హాజరయ్యారు.


వీపనగండ్లలో..


చిన్నంబావిలో..


గోపాల్‌పేటలో..


పెబ్బేరులో..


అమరచింతలో ఐఫ్టూ నాయకులు


మదనాపురంలో..


నర్సింగాపురంలో..


ఖిల్లా ఘనపురం మండలం సోళీపురంలో జెండాను ఎగురవేస్తున్న కార్మిక సంఘం నాయకులు

వరికుప్పను ఢీకొన్న బైక్: ఇద్దరికి గాయాలు

అమరచింత: రహదారిపై ఉన్న వరికుప్పను ద్విచక్ర వాహనం ఢీకోవడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నాగల్‌కడ్మూర్‌కు చెందిన పవన్‌కళ్యాణ్, బోయ రాములు ద్విచక్రవాహనంపై అమరచింతకు ఆదివారం రాత్రి బయలు దేరారు. నాగల్‌కడ్మూర్ గ్రామ శివారులోని మలుపుల వద్ద ఉన్న వరి కుప్పను గమనించకపోవడంతో బైక్ అదుపుతప్పి వరికుప్పను ఢీకొట్టింది. దీంతో బోయ రాము తలకు బలమైన గాయాలు, పవన్ కళ్యాణ్‌కు గాయాలు కావడంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం పాలమూర్ ఆస్పత్రికి తరలించారు.

బైక్‌పై నుంచి జారిపడి..

శుభకార్యం కోసం భర్తతో పాటు బైక్‌పై వెళ్తున్న మణెమ్మ బైక్‌పై నుంచి జారిపడి తీవ్ర గాయాలపాలు కావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అమరచింత పట్టణానికి చెందిన పోసిరి గారి గోవర్ధన్ తన భార్యతో కలిసి పేరూర్‌లో జరిగే బంధువుల ఇంటికి శుభకార్యం కోసం బైక్‌పై ఆదివారం బయలుదేరారు. అమరచింత శివారులో బైక్‌పై నుంచి మణెమ్మ జారి పడటంతో తలకు బలమైన గాయం అయింది. ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషయంగా ఉండడంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు.

ఆలయ భూమిలో అక్రమ నిర్మాణాలు ఆపండి

పెబ్బేరు: మున్సిపాలిటీ పరిధిలో కిష్టారెడ్డిపేటలోని ఆలయ భూమిలో అక్రమ నిర్మాణం చేస్తున్న పనులను ఆపాలని సోమవారం గ్రామస్తులు నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు గ్రామంలోని కొల్లాపూర్ రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సర్వేనంబర్ 225, 337, 354లో 6.52 గుంటల వేణుగోపాలస్వామి భూమి రూ.కోట్లు పలుకుతుండడంతో అక్రమార్కుల కన్ను పడిందన్నారు. ఈక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు భూమి సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారని తెలిపారు. ఆక్రమణకు గురైన భూమిని కాపాడాలని అధికారులు గతంలో కోర్టులో పిటిషన్ కూడా వేసినట్లు పేర్కొన్నారు. ఈ తరుణంలో ఆదివారం జరుగుతున్న ఓ ఇంటి నిర్మాణం పనులను గ్రామస్తులు, దేవాదాయ శాఖ అధికారులు అడ్డుకున్నారు.


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

సోమవారం ఆలయ భూమి 6.52 ఎకరాలో జేసీబీతో శుభ్రం చేసి ఆలయ భూమి కాపాడాలని రోడ్డు బైఠాయించి నిరసన చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని వారితో మాట్లాడడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కంచె అంజనేయులు, నాగరాములు, రాముడు, పరుశరాముడు, సర్వేష్, శ్రీనివాస్, తిరుపతయ్య, ప్రసాద్, అంజి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలతో నేలకొరిగిన పంటలు

కొత్తకోట రూరల్: కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి, ఈదురు గాలులకు పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో చేతికొచ్చిన వరిపంటలు నేల కొరిగాయి. అలాగే కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టిన పంట నీటి పాలు కావడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అధికారులు క్షేత్ర స్థాయిలో నష్ట తీవ్రత అంచనా వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమను ఆదుకోవాలని, లేకుంటే అప్పుల ఊబిలో కూరుకుపోతామని అన్నదాతలు వాపోతున్నారు.


నేలకొరిగిన వరిపంటను చూపుతున్న రైతు తిరుపతయ్య

జిల్లా వాసికి శ్రమశక్తి అవార్డు



వనపర్తి: సుమారు రెండున్నర దశాబ్దాల పాటు వలస కూలీ సంక్షేమ కోసం జిల్లా కేంద్రానికి చెందిన సదుర్ల రమేష్ చేసిన కృషిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం కార్మిక దినోత్సవం సందర్భంగా శ్రమశక్తి అవార్డును ప్రదానం చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, బిత్తిరి సత్తి చేతుల మీదుగా రమేష్ అవార్డును అందుకున్నారు. ఏళ్లుగా జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు పని కోసం వెళ్లిన వారి సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను చేశామన్నారు. ఇన్నాళ్లకు శ్రమకు తగిన గుర్తింపు లభించిందని అవార్డు గ్రహీత ఆనందం వ్యక్తం చేశారు.

కోర్టు ఆవరణలో పాము కలకలం

వనపర్తి: స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో సోమవారం జనం మధ్యలోకి పాము రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. విషయం గమనించి అక్కడి వారు సాగర్స్ స్నేక్స్ సొసైటీ వారికి సమాచారం ఇవ్వగా.. కృష్ణసాగర్ అక్కడికి వెళ్లి పామును పట్టుకున్నారు. పట్టుకున్న పామును సమీపంలోని వనపర్తి చిట్టడవిలో వదిలేస్తామని ఆయన తెలిపారు.

ధర్మాన్ని ఆచరించాలి

పెబ్బేరు: మండలంలో రాంపూర్‌లో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఇందూ ధర్మ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సాంద్ర సింధు వేదం, ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక, త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేస్తూ జీవాత్మ, ఆత్మ, పరిమాత్మ గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు వెంకట్రాములు, బాలయ్య, బద్రి, సురేష్, రవి, నాగరాజు, శివమ్మ, పద్మ, ఆదిలక్ష్మీ ఉన్నారు.



'ప్రజావాణి'కి దరఖాస్తులు కరువు

అమరచింత: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి ఆదరణ కరువైంది. కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ కార్యాలయాల్లోనే ప్రతి సోమవారం ప్రజావాణి ఏర్పాటు చేయాలని సూచించడంతో తహసీల్దార్ షేక్ చాంద్‌పాషా ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమానికి ఎంపీడీఓ జ్యోతిపరుషియా, ఎస్‌ఐ శివనాగేశ్వర నాయుడు, మున్సిపల్ మేనేజర్ గోవింద్ మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారులు మొదటి రోజు నిర్వహిస్తున్న కార్యక్రమానికి హాజరు కాలేక పోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలో ప్రజావాణి నిర్వహిస్తున్నామని గ్రామాల్లో ప్రచారం చేయకపోవడంతో ప్రజలకు విషయం తెలియలేదు. ఇప్పటికైనా అధికారులు ప్రజావాణిపై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.


అమరచింత తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణికి హాజరైన అధికారులు

పెబ్బేరు రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం శ్రీరంగాపురం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తహసీల్దార్ మురళి ప్రారంభించారు. మొదటి రోజు కావడంతో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తహసీల్దార్ తెలిపారు.

ప్రజల మనిషి 'పుచ్చలపల్లి'

వనపర్తి టౌన్: పుచ్చలపల్లి సుందరయ్య ప్రజల మనిషిగా, కమ్యూనిస్టు గాంధీగా చరిత్రకెక్కారని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ కొనియాడారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 110వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. కార్ల్ మార్క్స్, లెనిన్ భావజాలాన్ని పునికిపుచ్చుకొని పీడిత ప్రజల అభ్యున్నతికి పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, ప్రతినిధి భాస్కర్, కోనేటి వెంకటేశ్వర్లు, నందిమల్ల నాగరాజు, నిరంజన్‌గౌడ్, వెంకటయ్య, మురళీధర్‌చారి, మహేష్ పాల్గొన్నారు.


సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కొప్పునూరులో 'కంటివెలుగు' ప్రారంభం

చిన్నంబావి: మండలంలోని కొప్పునూరులో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ నంది కౌసల్య రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీపనగండ్ల పీహెచ్‌సీ డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ 15 రోజుల పాటు నిర్వహించే ఈ కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ రవి నారాయణ మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బంది వైద్య బృందానికి సహకరించి కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హేమవర్ధన్, ఆప్తమెట్రిస్ట్ పృథ్వీరాజ్‌సింగ్, సూపర్‌వైజర్ నాగరత్నమ్మ, హెల్త్ అసిస్టెంట్ జహంగీర్, డీఈఓ చంద్రశేఖర్, ఏఎన్‌ఎం జయమ్మ, రామేశ్వరి, ఉపసర్పంచ్ ఆనంద్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాంపూర్‌లో..

పెబ్బేరు: మండలంలోని రాంపూర్‌లో కంటివెలుగు శిబిరాన్ని సోమవారం సర్పంచ్ బస్వరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత కంటి పరీక్షలు చేసి కంటి అద్దాలు, మందులు, అవసరమైన వారికి ఆపరేషన్ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినేష్, వైద్యాధికారులు సుధారాణి, ఏఎన్‌ఎమ్‌లు వెంకటమ్మ, శారదమ్మ, ఆశ కార్యకర్త నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.


రాంపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

వేసవి క్రీడాశిక్షణ శిబిరం ప్రారంభం


శ్రీరంగాపురం శిక్షణ శిబిరంలో క్రీడాకారులు

పెబ్బేరు రూరల్: వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం కురుమయ్య సూచించారు. కలెక్టర్ ఆదేశానుసారం సోమవారం ఆయన శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ వేసవి క్రీడాశిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరం నిర్వాహకులు ప్రవీణ్, మధు మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 31 వరకు క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తామని, 14ఏళ్ల లోపు బాలబాలికలు కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ఉపయోగించుకొని, క్రీడల్లో మంచి ప్రావీణ్యాన్ని సంపాదించాలని సూచించారు. కార్యక్రమంలో పీఈటీ నిరంజన్‌గౌడ్, గ్రామస్తులు కురుమయ్య, కురుమూర్తి, బాలస్వామి, నవీన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్, శివ, పరశురాముడు, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు గోపిచంద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


ఖిల్లాఘనపురంలో..

ఆత్మకూర్: జిల్లా డీఎస్‌డీఓ ఆదేశాల మేరకు యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో ఆత్మకూర్‌లోని జాతర మైదానం మినీస్టేడియం ఆవరణలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా వాలీబాల్, పుట్‌బాల్ శిక్షణను సోమవారం ప్రారంభించినట్లు కోచ్ ఖాదర్, శ్రీకాంత్ తెలిపారు. ఆరేళ్ల వయస్సు నుంచి 16ఏళ్ల వయస్సు ఉన్న వారు వాలీబాల్ శిక్షణలో పాల్గొనాలని కోరారు. వివరాలకు మినీ స్టేడియంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, కౌన్సిలర్ మండ్లరామకృష్ణ, శివానంద్, జిందెమురళి, నరేందర్, బాలు, కిషోర్, జిన్నారంశ్రీను, భరత్, అఫ్రోజ్, దివాకర్, సందీప్‌రెడ్డి, సిరాజ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఖిల్లాఘనపురం సర్పంచ్ వెంకటరమణ, కోచ్ దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలోని మినీస్టేడియంలో సోమవారం అథ్లెటిక్స్ వేసవి శిక్షణ శిబిరాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో క్యామ వెంకటేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

వాలీబాల్ వేసవి శిక్షణ ప్రారంభం

మదనాపురం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో సోమవారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు విద్యార్థులకు వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం కార్యక్రమాన్ని సర్పంచ్ రాంనారాయణ చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి, పీఈటీ, ఉపాధ్యాయురాలు రామచంద్రమ్మ సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

వీఓఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

కొత్తకోట: ఐకేపీ వీఓఏల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని బీసీ పొలిటికల్ జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ సోమవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ఐకేపీ వీఓఏలు చేపట్టిన సమ్మెకు మద్దతు ప్రకటించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజుల నుంచి వీఓఏలు నిరసన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులకు రూ.వేల జీతాలు ఇస్తూ వీఓఏలకు రోజుకూ రూ.130 ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌నాయుడు, నరసింహా, అలివేల, స్వప్న, జమ్మన్న, శివాని, జయమ్మ, నిరోజ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్

పౌష్టికాహారం పంపిణీ

వీపనగండ్ల: పసిపిల్లల్లో రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, సువర్ణ, కృష్ణమ్మ, మాధవి, శాంతమ్మ, పారిజాత అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 7 నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారుల తల్లిదండ్రులకు బాలామృతం ప్యాకెట్లను అందజేశారు. పౌష్టికాహారంపై ఉన్న అపోహలను వీడి ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని వారు కోరారు.